# కిం కర్తవ్యం?

-సుశ్రీ

శ్రావణ్‌కి వేసవి సెలవులు. వాళ్ళమ్మమ్మగారింటికి వెళ్ళాడు. బస్సు దిగి నడుస్తున్న అతనికి పచ్చటి పంటచేలు, కిలకిలారావాలతో పక్షులు, గలగలా పారుతూ పిల్లా, పెద్దా కాలువలు, బొంగరాలాడుతూ ఊరి పిల్లలు, గణగణమని శబ్దముచేస్తూ ఐసు బండివాడు స్వాగతం పలుకుతూ, గతాన్ని కళ్ళముందుంచారు. తియ్యటి పాత జ్ఞాపకాలు ఒకటా రెండా? కాలువ గట్టున పరుగు పందాలు, తూనీగలను వెంటాడడము, కోతి కొమ్మచ్చి, గోళీల ఆటలు, గెడ్డలో ఈత కొట్టడాలు ఎన్నెన్ని విన్యాసాలు! ఆలోచనలనుండి బయటపడే సరికి వాళ్ళమ్మమ్మ ఇంటి ముందున్నాడు. కుశల ప్రశ్నల అనంతరమూ కాళ్ళు కడుగుకొని సావిట్లో ఉయ్యాల బల్లమీద కూర్చున్నాడు. ఇల్లు ఏమీ మారలేదు గత 5 సంవత్సరాలలో. రాత్రి భోజనానంతరమూ మేడమీదకి వెళ్ళి పక్కవేసుకొని ఆకాశములోకి చూస్తూ, తన చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పిన పేదరాశి పెద్దమ్మ కథలు, కాశీ మజిలీ కథలు తలుచుకుంటే మళ్ళీ ఆరోజులొస్తే ఎంత బాగుంటుంది అనిపించింది. తారాశశాంకము గురించి, చంద్రునిలోనున్న మచ్చ గురించి ఆలోచిస్తూ, ఆ నిశ్శబ్ద నిశీధిలో, ఊహలకందని విశ్వ సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాడు.

*** *** ***

సత్యలోకము, వైకుంఠము, కైలాసము, స్వర్గ లోకము, నరకలోకము ఆదిగా సమస్తలోకములూ (భూలోకము మినహా) అల్లకల్లోలముగా ఉన్నాయి. భూలోకములో అన్యాయాలు మితిమీరిపోతున్నా వైకుంఠవాసుడు, శ్రీమన్నారాయణుడు ఏల నిశ్చింతగా ఉన్నాడా? అన్నదే అందరిని వేదిస్తున్న ప్రశ్న - చివరకు సముద్ర తనయ కూడా! చిరు దరహాసముతో తనకేమీ పట్టనట్లు పన్నగశయనుడు శ్రీ సమక్షములో సేదతీరుతున్నాడు. సృష్టి కర్త అయినటువంటి బ్రహ్మదేవుని అధ్యక్షతన (పడిపోతున్న వివిధ లోకాల ప్రగతి సూచికలని దృష్టిలో ఉంచుకొని) అత్యవసర సమావేశానికి అన్ని సన్నాహాలు పూర్తి అయ్యాయి.

కలియుగము 4వ పాదము. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, ఇంద్ర, వరుణ, వాయు, కుబేర, యమాది దేవతా ప్రముఖులతో, స్వర్గ, నరక లోకాల ఉద్యోగులతో సభాప్రాంగణము క్రిక్కిరిసి ఉంది. అధ్యక్షునిగా బ్రహ్మదేవుని వేదికమీదికి ఆహ్వానించాడు ఇంద్రుడు. బ్రహ్మదేవుడు అధ్యక్షోపన్యాసము ఇచ్చే ముందుగా శివకేశవులను వేదిక మీదికి ఆహ్వానించాడు. ఎవరికి కేటాయించిన స్థానాలలో వారు ఆసీనులయ్యారు. సభా ప్రాంగణము క్రిక్కిరిసియున్నా నిశ్శబ్దము రాజ్యమేలుతోంది. బ్రహ్మదేవుడు గొంతు సవరించుకుని తన ఉపన్యాసము మొదలుపెట్టాడు."సోదర తుల్యులారా! నేటి భూలోక పరిస్థితి, మన లోకాలలో నిరుద్యోగుల పరిస్థితి, పడిపోతున్న మన ప్రగతి సూచికలను దృష్టిలో ఉంచుకుని నేటి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చెయ్యడము జరిగింది. మీకు తెలియనిది ఏముంది? 'మొక్కై వంగనిది మానై వంగదు' - నేడే సరియైన చర్య తీసుకొనకపోతే రేపు మనగతి అధోగతే. సామ్రాజ్యవిస్తరణ, లోకాలన్నిటిపైనా ఆధిపత్యము కోరుకునే కొన్ని సంపన్నదేశాల 'భూలోక'వాసులు ఇప్పటికే చంద్రలోకముపై కాలుమోపారు. అంగారకలోకాన్ని జయించే ప్రయత్నములో ఉన్నారు. నేడో రేపో మన ఇతర లోకాలపై వారి కన్ను పడకపోదు. మనము అప్రమత్తముగా ఉండడము ఎంతైనా అవసరం. శత్రువు మనల్ని

చుట్టుముట్టేలోపే మనము ఎదురుదాడి చెయ్యడము తెలివైన పనిగా భావిస్తున్నాను. మీ వద్దకు పంపబడిన సలహాల డబ్బాలో ఈ విషయముపై మీ మీ సలహాలను తెలియజేయండి. త్వరలో మనము ఒక నిర్ణయము తీసుకుందాం."

గ్లాసులో ఉంచిన నీళ్ళను కాస్త తాగి మళ్ళీ ప్రారంభించాడు సృష్టికర్త. "కొన్నాళ్ళ క్రితం వరకు (కొన్ని వందల సంవత్సరాలు - ఆయాలోకాలలో ఒకరోజుగా పరిగణింపబడుతుంది) సృష్టి నిర్మాణము నా చేతులపైనే జరిగేది. మనలోకాల ప్రగతి రేటుకూడా చాలా గొప్పగా ఉండేది. భూలోకములో Test Tube Babiesని సృష్టిస్తున్నప్పుడు మన లోకాలు కాస్త కంపించినా మళ్ళీ నిలకడగా ప్రగతి సూచిక పెరుగుతూనే ఉంది. ఎప్పుడో ద్వాపర యుగములో అవసరార్థం వ్యాసమహర్షి Test Tube Baby Technique వాడి కౌరవులను సృష్టిస్తే, ఆ సూత్రాన్ని (Formulaని) ఈ కలియుగములో మానవుడు తన ప్రయోగశాలలో విశేష కృషి ద్వారా సాధించుకున్నాడు. సరే అని ఊరుకున్నాము. నాటి విశ్వామిత్ర సృష్టికి కూడా నేను వెరవలేదు. ఎందుకంటే నా సృష్టి దాని కారణముగా అభిఘాతము (Impact) ఏర్పడలేదు. మహా మహా తపస్సు చేసి, దుర్వినియోగము చెయ్యరని నమ్మకమున్న కొద్దిమందికి మాత్రమే నేర్పిన ఈ Cloning Technique ని భూలోకవాసులు ఎలా హస్తగతం చేసుకున్నారో నాకు అవగతమగుటలేదు. ఈ విషయమై కేశవుడొక్కడే మనకు సహాయము చెయ్యగలడు. ప్రభుత్వాలు ఈ Cloning విధానాన్ని ఆమోదించకుండా అడ్డుపుల్ల వెయ్యాలని సూచిస్తూ, కేశవుని ఆహ్వానిస్తున్నాను." అని బ్రహ్మదేవుడు తన పద్మాసన స్థానాన్ని చేరుకున్నాడు.

చిరునగవుతో సకల జగాలను సమ్మోహితులను చేయగల శ్రీహరి సభికులకు ప్రణమిల్లి ఇలా చెప్పనారంభించాడు. "ఆహా! 'ఓడొచ్చి మద్దెలతో మొరపెట్టుకుందట' అలావుంది ఈ వైనం, ప్రస్తుత పరిస్థితి. వైకుంఠము పరిస్థితి కూడా చాలా దయనీయంగా ఉంది. ఎందుకని అడగకండి. దాని గురించే శేషునిపై పవళించి ఆలోచిస్తుంటే కునుకు వస్తోంది, గాని ఆలోచన రావటము లేదు. కింకర్తవ్యం? అని తర్జన భర్జన పడుతున్నాను. అవతారమెత్తడమూ అంత సులువు కాదు. పైగా ఏ అవతారము ఎత్తాలనేది కూడా కొరుకుడుపడడం లేదు. భూచరమైంది, జలచరమైంది, ఉభయచరమైంది, నరుడైంది, నారాయణుడైంది. తదుపరి ఏమిటి? ఎత్తిన అవతారమే ఎత్తితే మోజు (Craze) ఉండదాయె! Jurassic park 1కి ఉన్న మోజు Jurassic Park 2,3లకు లేదు కదా! ఇకపోతే ఈ యుగములో న్యాయం పక్షాన ఉండడమూ కష్టమే. రాజకీయాలలో (politicsలో), రణనీతిలో ఈ దేశాలు నన్ను మించిపోయి చాలా కాలమైంది. అన్యాయాన్ని అన్యాయమని నోరెత్తి చెప్పే ధైర్యము ఎవరికీ లేదు. పిచ్చుకలాంటి రాజ్యాలపై మన 'సృష్టికర్తగారి' అస్త్రాలను వేస్తున్నారు. ఈ అత్యవసర పరిస్థితిలో (Emergencyలో), గతములో మనని ఎన్నోసార్లు ఆదుకున్న, మన గరళకంఠుడు, త్రినేత్రుడే మనకు రక్ష. ఇప్పుడు శంకరుని ప్రసంగించమని కోరుతున్నాను." అని చెప్తూ ఆయనను ఆహ్వానించాడు శ్రీహరి.

వృషభవాహనుడు తటపటాయిస్తూ వచ్చి సభాసదులకు నమస్కరించి, "కేశవుడు నాకు తగని పెద్దరికాన్ని ఆపాదిస్తున్నాడు. ఇది కూడా ఆయన రాజకీయమేమో! 'ఎంత పెద్ద గుమ్మడి కాయైనా కత్తిపీటకు లోకువే' కదా! మానవులు ఎంత తెలివైన వారైనా వారిలోని బలహీనతలని (weak pointsని) సొమ్ము చేసుకోగల సత్తా మన హరికే చెల్లు. కాదని ఎవరైనా అనగలరా? నాడు భస్మాసురుడు తనకిచ్చిన వరాన్ని పరిక్షించుకుంటానని నా వెంటపడినప్పుడు, ఆ విషమ పరిస్థితి నుండి కడు నేర్పుతో నాకు ప్రాణభిక్ష పెట్టిన శ్రీహరే దేనికైనా సమర్థుడు" అని "అంతయేల అమృతాన్ని దేవతలకందించుటలో చూపిన నేర్పు జగద్విదితం" అని నొక్కి వక్కాణించడము వల్ల శ్రీహరికి ఏమీ పాలుపోలేదు.

ఇక లాభం లేదని లక్ష్మీవల్లభుడు శ్రోతల ముందుకు వచ్చి ఇవ్విధముగా చెప్పనారంభించాడు "నాడు కృత, త్రేతా, ద్వాపర యుగాలలో ఎంతో మంది అసురులను, అన్యాయ మార్గములో చరించినవారినీ - వారి శత్రువులనుండి బలాబలాలు గ్రహించి దెబ్బతీసాను. రావణుని వధకు విభీషణుడు, వాలిని చంపడములో సుగ్రీవుడు, నరకాసుర వధకు సత్యభామ, భీష్ముని చంపడములో శిఖండి, కర్ణుని చంపడానికి శల్యుడు ఇలా నాకు ఉపకరించారు. నేడు అన్ని దేశాలు అణ్వస్త్రాలు సమీకరించుకుని బలాబలాలు బేరీజు వేయడానికి బహు కష్టసాధ్యముగా నున్నది. నేటి అగ్రరాజ్యాలు బ్రహ్మదేవునికంటే, త్రినాధునికంటే శీఘ్రముగా అనర్హులకు వరాలు ఇవ్వడమువలన పరిస్థితి మరీ విషమిస్తున్నది. నాటి యుద్ధములలో సమయాసమయములు పాటించేవారు. అతిక్రమించిన సంఘటనలు బహు అరుదు. నేడు అర్ధరాత్రి సమయములో బాంబుల వర్షము కురిపించి, అన్నెం పున్నెం ఎరుగని సామాన్య నాగరీకులను కూడా హతమారుస్తున్నారు. నిరాయుధులైన వారిపై హింసాత్మక చర్యలు క్షమకు అనర్హమైనవి. పైపెచ్చు నాడు పాతాళానికి పంపిన ఎందరో రాక్షసులు నేడు తిరిగి భూమిపైకి వచ్చారు. వారిని ఎదిరించడము నిప్పుతో చెలగాటమే. నిప్పంటే గుర్తొచ్చిందీ - మన దేవేంద్రులవారు ప్రకృతి వైపరిత్యాలు సృష్టించుటలో పేరెన్నిక గన్నవారు. వారు బహుశా ఈ జటిల సమస్యకు పరిష్కారము చూపుదురేమో!" అని దేవేంద్రుని ప్రసంగించడానికి ఆహ్వానించాడు లక్ష్మీపతి.

తమ పతిదేవుల పరిస్థితికి జగన్మాతలైన లక్ష్మి, పార్వతి, సరస్వతులు నవ్వుకున్నారు. 'మళ్ళీ మనమే ఏకమై ఈ భూలోకాన్ని సరిదిద్దాలేమో' అని అనుకున్నారు. ఆదిశక్తిని ఆహ్వానించడము మాని దేవతలు పెద్ద తప్పే చేసారు. ఆదిశక్తిలోని శక్తిని మరచి అబల అనుకున్నారో ఏమో!

దేవేంద్రుడు సభాసదులను వళ్ళంతానున్న కళ్ళతో గమనించి కంట నీరులేక, కడుపులో దు:ఖమూ లేక, త్రిమూర్తులలో ఎవరో ఒకరు ఈ సమస్యా పరిష్కారము గావించెదరని, తన భోగములకు ఆటంకము కలుగదని విశ్వసిస్తూ, విషమ పరిస్థితిని అభినయిస్తూ "మేము మా విధులను సక్రమముగ నిర్వర్తించి చాలా కాలమయింది. వరుణుడు, వాయువు, అగ్ని అందరూ తమవంతు కృషిని చేస్తున్నారు. సూర్య చంద్రులు కూడా వారి వారి సహాయాన్ని అందిస్తున్నారు. రాహువు, కేతువులు కూడా భూలోకము మీద వారి ప్రతాపాన్ని చూపిస్తున్నారు. ఫలితము శూన్యం. అక్కడి ప్రజలు లంచాలతో బ్రతికేస్తున్నారు. వారికి ఆకలి దప్పులు కలిగేది లంచాలు దొరకనప్పుడు మాత్రమే! లంచగొండులు పెట్రేగిపోయి విచ్చలవిడిగా లంచాలు బొక్కుతూ మానవత్వాన్ని మంట గలుపుతున్నారు. చిన్న పెద్ద సంస్థలు లాలూచి పడి ప్రజాధనాన్ని తెగ మింగుతున్నారు. ఖాండవదహన సమయములో అజీర్తితోనున్న అగ్నిదేవునికి అరిగేందుకు ఓషదులు కావలసి వచ్చింది. వీరికా అవసరము కూడా రావడములేదు. కృత్రిమముగా వానలు కురిపించుకుంటూ వరుణుని ఆధిపత్యానికి స్వస్తి చెప్పారు. కావలసిన వాయువులను ప్రయోగశాలల్లో తయారు చేస్తూ, ప్రాణ వాయువుతో ఆవృతము కానట్టి వివిద గ్రహాలకు వెళ్ళే ప్రయత్నాలు చేస్తూ వాయుదేవుని అధికారానికి తిలోదకాలిచ్చే పరిస్థితిని తెస్తున్నారు. ఇక అగ్నిదేవునితో పనేలేదు. ఏ రెండు దేశాలమధ్య పచ్చ గడ్డివేసినా భగ్గుమని మండుతోంది. సూర్యనారాయణుడు తన చండ ప్రచండ తేజముతో భూలోకవాసున్ని తల్లడిల్లేటట్లు చేద్దామని చాలా ప్రయత్నము చేస్తున్నాడు. కానీ ఉన్నవాళ్ళు Air Condition తోనూ, లేనివాళ్ళు చర్మం కాస్త దళసరి చేసుకుని బ్రతికేస్తున్నారు. ఇక భూకంపాలు, వరదలు, తుఫానులు ఎన్ని వచ్చినా ప్రజలు పట్టించుకోవడము మానేసారు. అవి సర్వసాధారణమైన విషయాలుగా తృణీకరిస్తున్నారు. యాగములు, క్రతువులు పూర్తిగా మానివైచి, దేవతార్చన అంతా కంప్యూటర్ తెరపైనే చేస్తూ ఏ సుగంధాల గుబాళింపు లేకుండా కానిచ్చేస్తున్నారు. తెలివైన వాళ్ళు కొందరు చందాలరూపేనా గుటకాయస్వాహా చేస్తూ లక్షలకు పడగలెత్తుతున్నారు.

ఇక మన్మధునికి ఆధిపత్యము పోయింది. మగువ విలాసవస్తువుగా, విలాసము కావలసినప్పుడు కొనుక్కునే వస్తువుగా మారిపోయింది. ఏవిధముగా చూసినా శాంతికి విశ్రాంతి, నీతికి భీతి కలిగిస్తున్నారు. వనాలు, తటాకాలు పోయి వాటి స్థానే ఆకాశహర్మ్యాలు ఆవిష్కరిస్తున్నారు. అదిగదిగో చూడండి - అటు petronas Towers, ఇటు Empire State Building. అదిగో ఆ ప్రక్కనే కొన్ని ఘడియల క్రితము వరకూ రొమ్ము విరుచుకు నిలుచున్న World Trade Center Buildings ఓ అగంతకుడి, అనాగరికుని పగకు నేలమట్టమైనాయి. ఈ విషయములో యమధర్మరాజుగారు ఏమైనా చెయ్యగలరేమో!" అని యమధర్మరాజుగారిని ఉపన్యాసమునకు ఆహ్వానించాడు సహస్రాక్షుడు.

ఠీవిగా, వజ్రాలంకృత నవరత్నఖచిత శిరస్త్రాణముతో, ధగ ధగ మెరిసే ఆభరణములు వక్షస్తలాన్ని ప్రకాశింప జేస్తుండగా, చిత్రగుప్త సమేతముగా యమధర్మరాజు ప్రసంగము చేసేందుకు ఉద్యుక్తుడవుతూ గధను ప్రక్కనుంచి, చిత్రగుప్తుడు తయారుచేసిన ప్రసంగాన్ని తెలుగు భాషలో (Telugu Word formatలో) గణణ యంత్రపు తెర్పై (Computer Screen మీద) స్పష్టముగా ఆవిష్కరించబడగా గొంతు సవరించుకుని "సోదర సోదరీ మణులారా! నాకీ అవకాశమునిచ్చినందుకు కృతజ్ఞతలు. ఈ ప్రస్తుత పరిస్థితిని మా చిత్రగుప్తుడు ఇదివరకే అంచనావేసి, దానికి తీసుకొనవలసిన జాగ్రత్తలను కూడా సూచించాడు. దాని పర్యవసానమే మా On site work allocation. గతములోలా కాకుండా ఇప్పుడు భూలోకములోనే దాదాపు 10 శాఖలు పనిచేస్తున్నాయి. ఇంకో 20 శాఖలు విశ్లేషణలో ఉన్నాయి. దీని వలన communication gap, రవాణా ఖర్చులు తగ్గుతున్నాయి. పైగా ఇక్కడ పెరుగుతున్న పని వత్తిడి కాస్త తగ్గుముఖం పడుతుంది. యుగయుగానికీ పాపుల సంఖ్య పెరిగిపోతోంది. సమయము వస్తేగాని (పోయేకాలము ఆసన్నమైతేగాని) ఎవరిమీదా పెత్తనము చెయ్యడానికి లేదు కదా! Computerize చేసిన తరువాత చిత్రగుప్తులవారి పని కాస్త తేలిక అయింది. Softwareలో perfection కోసం చిత్రగుప్తులవారు చాలా కృషి చేస్తున్నారు. ఈ Softwareలో నున్న కొన్ని bugs కారణముగా అంత్యకాలము దాపురించినా కొంతమంది నరరూప రాక్షసులు తప్పించుకొని తిరుగుతున్నారు. త్వరలో ఆ bugs fix చేసి 100% bug free software అందించగలమని software professionals challenge చేస్తున్నారు. వారికి కావలసిన resources అన్నీ సమకూరుస్తూ వారిని మేము ప్రోత్సహిస్తున్నాము. ఇకపోతే Research & Development Unit కూడా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాది. మా ప్రగతి రేటు పెరగడానికి మేము తీసుకున్న ఈ నిర్ణయాలు, మా వాణిజ్య సరళి చాలా దోహదం చేసాయి. On site branchesలో స్థానిక ఉద్యోగులను (local employeesని) చేర్చుకుంటున్నాము. దానివల్ల నిర్వాహణా వ్యయము (cost of maintenance) తగ్గుతోంది. పాపులకు విధించే మానసిక, శారీరక శిక్షలు ఇప్పుడు భూలోకములోనే విజయవంతముగా అమలు పరుస్తున్నాం. భూలోకములో వివిధ దేశాలలో నేడు జరుగుతున్న మారణకాండ వేరొకటి కాదు, యమలోక శాఖల కార్యనిర్వాహణే. చిన్న చిన్న పాపాలు చేసేవారికి మానసిక శాంతి లేకుండా, ఉద్యోగ, విద్యా, ధనసముపార్జన బాధలను automate చేసి పదిమందికి బదులు ఒక్కరు సూత్రాన్ని (1 person instead of 10 formulaని) అమలుపరుస్తున్నాం. దీనివలన ఉద్యోగుల సంఖ్య, వాళ్ళ భీమా ఖర్చులు (Insurance), bonus లాంటి ఖర్చులు తగ్గించి పురోగతి సాధిస్తున్నాం. మా చిత్రగుప్తులవారి సలహాతో Centralized Database Serverని install చేసారు. కావున ఏ శాఖనుండైనా ఈ Recordsని access చేసే వీలు కలుగుతుంది. దీనిని ఇప్పటికే 4 శాఖలలో అమలు చేశాము. గతంలో పడిపోయిన ప్రగతి సూచి తిరిగి పెరగడానికి మా ఈ వర్తక ప్రణాళికా నమూనా (Business Model) కారణం. భూలోకములో మాకు పోటీదారులుగా (competitorsగా) ఎదగడానికి ప్రయత్నించిన చిన్న చిన్న సంస్థలను మేమే కొని scrap చేసాము.

ఇంతలో "నారాయణ! నారాయణ!" అంటూ నారదమహర్షి ఆగమనం అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచింది. ఊరకరారు మహాత్ములు! ఎక్కడ ఏ కొంపమీదికి ఏమి తెచ్చాడోనని అందరూ భయభ్రాంతులయ్యారు కలహభోజనుని గాంచి.

రానున్న వత్సరానికి వార్షిక ప్రణాళికను రూపొందించాము. దానిని అమలు చెయ్యడము ద్వారా గత సంవత్సర నికర లాభము కంటే ఈ సంవత్సరము 30 శాతము పెంచగలమని విశ్వసిస్తున్నాము." అని తన వార్షిక ప్రగతి పత్రాన్ని (Annual Report) సగర్వముగా యమధర్మరాజు చదివి వినిపించాడు. కరతాళ ధ్వనులతో సభ మారుమ్రోగింది. సభికులకు ధన్యవాదములు తెలుపుకుని తనకు నిర్దేశించిన ఆసనాన్ని సమీపించాడు యమధర్మరాజు.

"భూలోకవాసులు మొట్టమొదట అడుగిడినది తన స్థావరము మీదనే అని తెలిసి కూడా తనను వేదికపైకి ఆహ్వానించక, నా సలహాను అర్థించక వీరు నన్ను తృణీకరిస్తున్నారు కదా! భూలోక వాసుల సాంకేతిక పరిజ్ఞానము, వారు తన స్థావరము మీదికి పంపిన యంత్రము, తన స్థావరము మీద దిగిన మానవులు, వారు తీసుకు వెళ్ళిన రాళ్ళు (ప్రయోగాల నిమిత్తము) వంటి విషయాలు నాకు తెలిసినంతగా వీళ్ళకి తెలియదు. 'చిన్న పుట్టలో కూడా పెద్ద పాము ఉండవచ్చు'ననే వాస్తవాన్ని వీరు విస్మరిస్తున్నారు." అని కలువలరేడు నవ్వుకున్నాడు.

ఇంతలో "నారాయణ! నారాయణ!" అంటూ నారదమహర్షి ఆగమనం అందరినీ సంభ్రమాశ్చర్యాలలో ముంచింది. ఊరకరారు మహాత్ములు! ఎక్కడ ఏ కొంపమీదికి ఏమి తెచ్చాడోనని అందరూ భయభ్రాంతులయ్యారు కలహభోజనుని గాంచి. బ్రహ్మవిష్ణుమహేశ్వరులు నారద మహర్షిని సాదరంగా ఆహ్వానించి, క్షేమ సమాచారములు విచారించి, వారి సమస్యను క్లుప్తముగా వివరించి త్రిలోక సంచారి సలహాను అర్థించారు. నారదుడు ఒక్కసారి మహతిని మీటి ఇలా చెప్పనారంభించాడు "సోదర తుల్యులారా! ఈ జటిలమైన సమస్యకు - ఎన్నో ఎన్నెన్నో సమస్యలకు పరిష్కారము చూపించిన - ఈ శతాబ్దపు మేధావి (mobile computer) పరిష్కారము చూపగలడేమో!" అని ప్రస్థావించగానే - సభలో ఉత్కంఠ! ఎవరా వ్యక్తి? ఏమాతని చిరునామా?? అని. చిరునగవు చిందిస్తూ నారద మహర్షులవారు "జంబూ ద్వీపే, భరతవర్షే, భరతఖండే ఆంధ్రప్రదేశే" అంటుండగా సభాసదులలో ఆసీనులైన నందమూరి తారకరామారావు గారు, తదితర మాజీ ఆంధ్రులు "ఔరా! ఎవరా వ్యక్తి? ఆంధ్రతేజాన్ని విస్తరింపజేస్తున్న తెలుగు బిడ్డడు. జయహో!" అని మన: స్పూర్తిగా దీవించారు. "ఆంధ్ర ప్రదేశ్ CEO బిరుదాంకితుండు, మాజీ ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నామధేయుడు" అని సందేహనివృత్తి చేసారు నారదులవారు. "అహో! మమ్ములను వెన్నుపోటుపొడిచి మా పతాకమును, మా పార్టీని, మా పార్టీ గుర్తును, చివరకు మమ నామ కీర్తిని ఉపయోగించి విశ్వవిఖ్యాతి గాంచుటయా! కలికాలము కదా! - చెట్టు పేరు చెప్పుకొని కల్తీ కాయలు అమ్ముకాలము దాపురించినది గదా!" అని నందమూరివారి వదనము వివర్ణమయింది.

నిశ్శబ్దముగా నున్న శ్రోతలనుద్దేశించి నారదులవారు చెప్పసాగారు "రోజుకు 20 గంటలు పనిచేసి, కార్యవర్గాన్ని సన్మార్గములో నడిపించి, ఆంధ్రరాష్ట్రానికి ప్రపంచకీర్తిని ఆపాదించిన ఈయన కార్యదీక్ష కడు ప్రశంసనీయము. నిలుచున్నచోటి నుండే ఏ సమయములోనైనా ఏ వ్యక్తి ఏమి చేయుచున్నాడో, ఏ ప్రదేశములో అభివృద్ధిపనులు ఎలా సాగుతున్నాయో లాంటి విషయాలను తెలుసుకోగలిగిన network సమకూర్చుకుని teleconferencingతో పనులు చేయించగలిగిన సమర్థ పాలకుడు ఈయన" అని చెప్పగానే, ఆయనను తదుపరి సమావేశమునకు ఆఘమేఘాలపై తోడ్కొని వచ్చుటకు సన్నాహాలు చేయమని అధ్యక్షులవారు ఆజ్ఞ జారీ చేయబోతుండగా, నారదుడు చతుర్ముఖుని ఆపి, ఆయన ఇక్కడకు వచ్చే తీరుబడి లేదని, ఓ phone చేస్తే ఆయనే appointment ఇస్తాడని, ముఖ్యముగా యమలోక దస్తావేజులు computerization, రానున్న కాలాలలో మిగతా లోకాల computerization గురించి ప్రస్తావిస్తే ఆయన త్వరగా appointment ఇచ్చే అవకాశాలున్నాయని సలహా ఇచ్చాడు. చూచాయిగా నారావారి ఖ్యాతి విన్న దేవతాప్రముఖులకు సమస్యా పరిష్కారము జరిగినంత ఆనందము పొందారు. "ఔరా! నాకే బాబునని సగర్వముగా చెప్పుకొంటున్న ఈ భూలోకవాసునికెంత ధైర్యం?" అని చంద్రుడు విస్తుపోయాడు. సభాప్రాంగణము కరతాళధ్వనులతో మార్మోగిపోతోంది.

*** *** ***

తనను తొప్పుట్లు కొట్టకుండా తన చేతులు ఎవరో పట్టుకున్నట్లు అనిపించడముతో ఒక్క ఉదుటున లేచిన శ్రావణ్‌కి నిద్రాభంగమై, ఈ లోకములో పడ్డాడు. చంద్రుడు తనకివేమీ పట్టనట్లు తారలవంక చూస్తూ ఆనందిస్తున్నాడు. తెల్లవారడానికి ఇంకా సమయము పడుతుందని శ్రావణ్ ముసుగుతన్ని పడుకున్నాడు.